కథ

# అయ్యో పాపం!

యం. యస్. యన్

**భగవంతుడిమీద సమస్త హక్కులూ సాధించుకొన్న ఓ భక్తుడి ప్రయోజకత్వం— ఏతత్ 'పలుకుబడి'కి దేవుడు అనుగ్రహించిన శిక్ష!**

శివరావు గొప్ప విష్ణుభక్తుడు!

కానీ, కన్నవాళ్ళు తన పేరు శివరావు అని పెట్టడం అతనికి ఏమాత్రం గిట్టలేదు.

అది గుర్తొచ్చినప్పుడల్లా అతనికి దురదగుంటాకు రాసుకున్నట్లు ఉంటుంది.

శివుడి పేరెందుకూ... ఆయనలాగే అడుక్కుతినడానికా! శివుడు అడుక్కుతినేవాళ్ళ దేవుడు. ఆయన వృత్తి అదేగా... కావాలంటే శివాలయానికి వెళ్ళిచూడు. ఉత్త బూడిద తప్ప ఇంకేం ఉండదు!

ఉండేది వల్లకాట్లో— వృత్తి భిక్షాటనం! నీళ్ళు దొరక్క గొంతెండినప్పుడూ శ్రీనాథుడు కూడా వెక్కిరించలేదూ! 'తిరిపెమానకిద్దరాండ్రా... పరమేశా... గంగవిడువు... పార్వతి చాలున్...' అని. బాగా అన్నాడు! అడుక్కుతినే వాడికి ఇద్దరు పెళ్ళాలు కూడా ఎందుకయ్యా!

శివాలయాలు కరువు పునరావాస కేంద్రాల్లా ఉంటాయి—

అదే వైష్ణవాలయానికి వెళ్ళు...

రంగరంగ వైభోగం!!

చక్కెర పొంగలి...దర్ధోజనం.. స్వామివారికి పట్టుపీతాంబరాలూ... నగలూ...నాణ్యాలూ. భక్తులకు శేషవస్త్రాలూ...

అందుకే తనకి వైష్ణవం అంటే మక్కువ!

కానీ తన పేరేమో శివరావు...

గుడ్డిలో మెల్ల ఏమిటంటే, ఇనిషియల్సుతో కలిపితే తనపేరు కే.శివరావు! కేశవరావు అన్నదానికి కాస్త దగ్గరగానే ఉంటుంది.

విష్ణువు అవతారాల్లో తనకి తిరపతి వెంకన్న అంటే మహాఇష్టం! రిచ్చెస్ట్ గాడ్ గదా!

పిలిస్తే పలికే దైవం గదండీ!

అందుకే ఆయన్ని తన బిజినెస్ పార్టనర్‌గా చేసుకున్నాడు. తనపై సంపాదనలో టెన్ పర్సెంట్ కమిషన్ ఇస్తాడు— రెగ్యులర్‌గా!

పైగా—

ప్రతిసమ్మర్‌లో తను కొండకి వెళ్తాడు.

ఈ సంవత్సరం కూడా ఈపాటికి తను కొండకి వెళ్ళి ఉండాల్సిందే! ఈసారి పిల్లాడి ఎంసెట్ పరీక్షలు శేషన్‌గారి బీహార్ ఎలెక్షన్లలా పదిసార్లు వాయిదా పడ్డంవల్ల ప్రోగ్రాం అప్‌సెట్ అయిపోయింది. రేపు తప్పనిసరిగా వెళ్ళాలి. లేకపోతే మళ్ళీ 'డేట్సు' కుదరవు!

డేట్స్— కాదామరి— తన శ్రీమతి ఒక ఎంప్లాయీ— తనొక ఎంప్లాయీ కాదు కేమో— స్టూడెంటు—

ఒకళ్ళకి కుదిరితే ఇంకొకళ్ళకి కుదరదు—

అందుకనే రేపే వెళ్ళితీరాలి. మూడో రోజుకి మళ్ళీ ఇక్కడుండాలి.

ఓ కాంట్రాక్టరు తి 'షేరు' డబ్బులు ఇవాళ ఇచ్చాడు. అందుల్లో స్వామి 'షేరు' హుండీలో వేసిరావాలి.

రేపే వెళ్ళాలి— తనకి లీవు దొరుకుతుంది. కానీ ఆవిడకి ఆఫీసులో ఇన్‌స్పెక్షనుట—

అందుకే సిక్‌లీవు పెట్టేస్తోంది. తిరిగి వచ్చాక డాక్టరు సర్టిఫికేట్ ప్రొడ్యూస్ చెయ్యొచ్చు. మెడికల్ సర్టిఫికేట్ల మీదనే బతికేసే డాక్టరు ఒకాడు తనకి తెలిసినవాడు ఉన్నాడు.

లీవు అంత ప్రాబ్లెం కాదుగానీ...

ఇప్పటికిప్పుడు ట్రెయిన్ టిక్కెట్లు రిజర్వేషన్ ఎలా?

బస్సు అంటే పన్నెండు గంటల ప్రయాణం! ఎంత డీలక్సు అయినా డీలా పడిపోవడం ఖాయం!

వెళ్తే హాయ్‌గా ట్రైయిన్‌లో త్రీటైర్‌లో వెళ్ళాలి. అంతకు మించిన సుఖం ఇంకోటి ఉండదు—

వెంటనే రైల్వే రిజర్వేషన్ ఆఫీసుకి వెళ్ళాడు శివరావు. అక్కడ హనుమంతుడి తోకలాంటి క్యూ! సమ్మర్ రష్!

బట్...

దీని తాతలాంటి క్యూలని చాలా చూశాడు తను. క్యూ బ్రేక్ చేసేసి ముందుకెళ్ళిపోయే ట్రిక్కులు తనకి శతకోటి తెల్సు!

ప్రసన్న వదనం పెట్టి, 'ఒక్క నిమిషం' అంటూ కౌంటర్ దగ్గరికెళ్ళిపోయి, ఏదో సమాచారం అడిగాడు. అదయిపోయాక అక్కడే నిలబడిపోయాడు. కొద్ది నిమిషాల తర్వాత, లాఘవంగా క్యూలో కలిసిపోయాడు. టిక్కెట్లు దొరికాయి. చివరి మూడు టిక్కెట్లుట! క్యూలో నిలబడితే మటాష్ అయిపోయేది తనపని!

మర్నాడు శివరావూ, శ్రీమతీ, జూనియర్ కలిసి ఝామ్మని రైలెక్కేశారు.

పొద్దున్నే తిరుపతి చేరారు. లింకు బస్సులో తిరుమలకి చేరుకున్నారు.

ఇక్కడే ఉంది మొసళ్ళ పండగ!

కాటేజి రిజర్వేషన్ క్యూ కాటెయ్యడానికి రెడీగా ఉన్న కాల సర్పంలా ఉంది.

సమ్మర్ రష్ ఎగెయిన్!

క్యూలో నిలబడితే, సగం రోజు ఇక్కడే గడిచిపోయేట్లు ఉంది.

ఇట్లా లాభం లేదని జేబులో నుంచి కాసిని నోట్లు తీశాడు. "నమ్మకస్తుడిలా కనబడుతున్న ఓ దళారి" దగ్గరికెళ్ళిపోయాడు. కాటేజ్ దొరికింది.

కాటేజ్‌లో కాఫీ, గీఫీ— స్నానం—పానం—

ఇంక దర్శనం...

సమ్మర్ రష్ భయపెడుతోంది.

తనకి తెలిసిన ఒకతను ఇక్కడే ఆర్టీసీలో ఉండాలి.

వెళ్ళిచూశాడు.

లక్కీగా అతను కనబడ్డాడు.

దర్శనం ఏర్పాట్లు చేయించాడు.

దర్శనం తర్వాత—

అక్కడే నిలబడ్డ వాలంటీర్ చేతిలో ఓ పది పెడితే—

ఇంకో అయిదు నిమిషాలు ఎక్స్‌ట్రా దర్శనం—

దర్శనం బాగా జరిగిరది.



బయటికి వచ్చాక—

ఉచిత ప్రసాదం క్యూ—

ప్రసాదం ఇచ్చే ఆయన ఓ చెయ్యి ప్రసాదం బుట్టలో ఉంచి, ఇంకో చెయ్యి ముందుకి జాపి, భావగర్భితంగా చూశాడు.

ఆ చేతిలో ఓ అయిదు ఉంచితే—

రుచిగా ఉండే ఉచిత ప్రసాదం మూడు రెట్లు అందింది.

ఇంక అసలైన ఘట్టం ఇప్పుడుంది!

లడ్లు కావాలి.

ముష్టేసినట్లు తలకి ఒకటి చొప్పున మొత్తం మూడు లడ్లు ఇచ్చారు—

అవేం సరిపోతాయ్!

తాము ముగ్గురూ తినడానికే మూడు లడ్లు సరిపోవు!

పైగా—

పందారం చెయ్యడానికి పది లడ్లన్నా కావద్దూ—

కంట్రాక్టరు చాలా మంచోడు— వాడికి ఒకటీ—

ఆఫీసరుగారికి ఒకటీ—

మూర్తిగాడితోపని బడింది— వాణ్ణి మంచి చేసుకోవడానికి ఒకటీ.

ఆఫీసులో కొత్తగా చేరింది అందమైన అమ్మాయి. ఆ అమ్మడి దగ్గర ఇంప్రెషన్ కొట్టెయ్యడానికి ఒకటీ.

తిరుపతి లడ్డూలాంటి పిల్లకు తిరుపతి లడ్డు ప్రసాదం—

భలే! పిల్లను తల్చుకోగానే కవిత్వం పుట్టుకొచ్చేస్తోందే!

సరే— ఇరుగు వాళ్ళకీ పొరుగువాళ్ళకీ తప్పనిసరి తద్దినంలా పంచడానికో రెండు లడ్లు—

మొత్తం ఓ పది లేకపోతేపని గడవదు!

కావాల్సిన లడ్లు బ్లాకులో కొన్నాడు.

పని పూర్తయిపోయింది.

రాత్రికి— లీజర్‌గా, 'మయూరా'లో మంచి భోజనం— సుఖనిద్ర—

తెల్లారిలేచి తిరుగు ప్రయాణానికి రెడీ అవుతుండగా—

శివరావు శ్రీమతితో చెప్పాడు.

"ఏం మర్చిపోలేదు కదా! అల్మారాలు అన్నీ ఓసారి జాగ్రత్తగా చెక్ చెయ్యి."

యథాలాపంగా అలమారులో చూసింది శ్రీమతి.

వెంటనే కెవ్వున కేకపెట్టింది.

"ఏమిటి? తేలా? అన్నాడు శివరావు అద్దిరిపడి.

'కాదు—నోట్లు!' అంది శ్రీమతి

"ఏం నోట్లు?"

"వంద రూపాయల నోట్లు— ఇరవై ఉన్నాయ్!"

'అంటే— రెండు వేలా?'

"ఎవరో మర్చిపోయి ఉంటారు" అంది శ్రీమతి.

"ఎవరో మర్చిపోవడం కాదు. దేవుడు మనకి ఇచ్చాడనుకోవాలి! ఈ ట్రిప్పు ఖర్చు గడచిపోయినట్లే!!" అన్నాడు శివరావు ఆనోట్లని ఆనందంగా పర్సులో పెట్టుకుంటూ.

** ** **

తిరుగు ప్రయాణంలో కూడా, పాములపటంలో పెద్ద పాములాంటి క్యూని చలాగ్గా అధిగమించి, టిక్కెట్లు దొరకపుచ్చుకున్నాడు శివరావు—

అతని చలాకీతనం ఫలితంగా ముగ్గురు ముసలమ్మలు అక్కడే దిగబడిపోవాల్సి రావడం అతనికి పట్టలేదు.

రైలు ఎక్కాక, అలవోగ్గా అరటిపండు ఒలిచి, నోట్లో పెట్టుకుంటూ, శ్రీమతితో అన్నాడు శివరావు—

"ఏడాదికోసారి అన్నా ఇట్లా కొండకి వచ్చి దర్శనం చేసుకోకపోతే ఇహ పుణ్యం పురుషార్థం ఏముందీ! అవునా?" అని.

అది వింటున్న జూనియర్ "పుణ్యమా! అయ్యోపాపం!" అనుకున్నాడు.

** ** **

ఇదంతా చూస్తూనే ఉన్నాడు ప్రత్యక్ష దైవం తిరుపతి వెంకన్న. ఆయనపక్కనే పద్మావతి అమ్మగారు ఉన్నారు.

"హారా!" ఏమి ఈ భక్తుడి అఘాయిత్యం! పుణ్యం మూటకట్టుకుంటానని వచ్చి పాపం మూటగట్టుకెళ్తున్నాడే!" అంది అమ్మవారు కోపంగా.

స్వామివారు విలాసంగా నవ్వారు.

"నవ్వుతారేమిటండీ! శిక్ష విధించక!" అంది అమ్మవారు.

"ఆ శిక్షేదో నువ్వే చెప్పూ!" అన్నారు స్వామివారు.

కాసేపు ఆలోచించి అంది అమ్మవారు— "శిక్ష కాస్త కొత్తరకంగా ఉంటే బావుంటుంది— మీ భక్తుడి బుర్రకి మతిపిచ్చీ, వాడి భార్యకి స్త్రీవాదం, వాళ్ళ వంశాంకురానికి పంక్ కల్చరూ వచ్చేట్లు అనుగ్రహించండి. ఈ జన్మకి ఆ వరకూ చాలు!"

"సరే! తథాస్తు! ఇంక పడుకుందాం దేవీ! మళ్ళీ ఇంకో అయిదు నిమిషాల్లో సుప్రభాతం పెట్టి లేపేస్తారు." అన్నారు స్వామివారు ఆవలిస్తూ!